పోలింగ్ బూత్‌లకు ఎన్నికల సామగ్రి



ఈవీఎంలతో పోలింగ్‌బూత్‌లకు సిబ్బంది

రామంతాపూర్: రామంతాపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన డీఆర్‌సీ నుంచి మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గంలోని ఉప్పల్ అసెంబ్లీ సెగ్మెంట్‌కు అధికారులు ఆదివారం ఎన్నికల సామగ్రి పంపిణీ చేశారు. సెగ్మెంట్‌లోని 407 బూత్‌లకుగాను మొత్తం 1,221 ఈవీఎంలు, 407 వీవీ ప్యాట్లు, 407 కంట్రోల్ యూనిట్లను పోలీసు బందోబస్తు నడుమ తరలించినట్లు ఉప్పల్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, మేడ్చల్ జిల్లా డిప్యూటీ కలెక్టర్ అభిషేక్ అగస్త్య తెలిపారు. సజావుగా ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు 2,002 మంది అధికారులు, సిబ్బందికి ఇదివరకే శిక్షణ అందించినట్లు వెల్లడించారు. ఈవీఎంల తరలింపు కోసం సరిపడా వాహనాలను ఏర్పాటు చేసి వాటికి జీపీఎస్‌సి సిస్టమ్ అమర్చామని, డీఆర్సీ నుంచి ఎన్నికల సామగ్రితో నేరుగా పోలింగ్ బూత్‌లకు చేరుకుంటాయని ఆయన తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పకడ్బందీగా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. వృద్ధులు, దివ్యాంగుల కోసం పోలింగ్ బూత్‌ల వద్ద వీల్‌చైర్లు, ర్యాంపులు ఏర్పాటు చేయడంతోపాటు వారిని బూత్‌ల వద్దకు తీసుకువచ్చేందుకు ఆటోరిక్షాలకు అనుమతిస్తున్నట్లు రిటర్నింగ్ అధికారి తెలిపారు. శాంతియుత వాతావరణంలో పోలింగ్ నిర్వహించేందుకు బూత్‌ల వద్ద రెండంచెల పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని, ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటుహక్కును నిర్భయంగా ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు.

బీజేపీలో చేరిన మాజీ కార్పొరేటర్



ఉప్పల్ : చిలుకానగర్ బీఆర్ ఎస్ మాజీ కార్పొరేటర్ గోపు సరస్వతి సదానంద్ ఆదివారం మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ సమక్షంలో తన అనుచరులతో కలిసి బీజేపీలో చేరారు. కార్యకర్తలు, ఉద్యమకారులను పక్కన పెట్టి ఉద్యమ ద్రోహులకు బీఆర్ఎస్ టికెట్లు కేటాయిస్తుందని సదానంద్ విమర్శించారు. కొర్రం కృష్ణనాయక్ సైతం బీజేపీలో చేరారు. కంచర్ల భరత్‌రెడ్డి, శ్రీనివాసశర్మ, సతీష్ తదితరులున్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



ఉప్పల్: ఉప్పల్ మిని శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అన్నమాచార్య ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకులు అభిషేక్ సూత్రపు ఆధ్వర్యంలో అన్నమాచార్య జయంతి సందర్భంగా పలు కార్యక్రమాలను నిర్వహించారు. అన్నమయ్య కీర్తనలు, కూచిపూడి నృత్య ప్రదర్శన తదితర అంశాలు ఆకట్టుకున్నాయి.



డీఆర్సీ సెంటర్ ఈవీఎం స్ట్రాంగ్‌రూమ్‌ను పరిశీలించిన అధికారులు, పార్టీ నేతలు



డీఆర్సీ సెంటర్‌లో ఎన్నికల సిబ్బంది



మల్కాజిగిరి బాలికల పాఠశాలలో..

పోలింగ్‌కు సర్వం సిద్ధం

మల్కాజిగిరిలో 418 పోలింగ్‌బూత్‌లు

- 5,08,048 మంది ఓటర్లు
- అసెంబ్లీ ఎన్నికల తర్వాత పెరిగిన ఓటర్ల సంఖ్య

మల్కాజిగిరి/అల్వాల్: మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో జరిగే పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తయ్యాయి. నియోజకవర్గం పరిధిలో 418 పోలింగ్ స్టేషన్లకు నేరేడ్‌మెట్ భవన్స్ కాలేజీలో ఏర్పాటు చేసిన డీఆర్సీ నుంచి పోలింగ్ సిబ్బంది చేరుకుని ఏర్పాట్లు పూర్తి చేశారు.

- మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలో (మల్కాజిగిరి, అల్వాల్ సర్కిల్స్) మొత్తం 5,08,048 మంది ఓటర్లు ఉండగా.. వారిలో 2,55,325 మంది పురుషులు , 2,52,712 మంది మహిళలు , ఇతరులు 11 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో కొత్త ఓటర్లు 9,256 మంది ఉన్నారు.
- ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల కంటే ప్రస్తుతం 19,005 మంది ఓటర్ల సంఖ్య పెరిగింది. ప్రతి ఒక్కరూ ఓటు వేయడమే లక్ష్యంగా ఇంటింటికి ఓటరు స్లిప్స్ పంపిణీ బీఎల్‌ఓల ద్వారా చేపట్టామని అధికారులు చెప్పినప్పటికీ పలు కాలనీల్లో ఓటరు స్లిప్స్ అందలేదన్నారు.

పటిష్టమైన బందోబస్తు..

ఎన్నికలు సజావుగా జరగడానికి మల్కాజిగిరి, నేరేడ్‌మెట్, అల్వాల్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి, సీఐ సత్యనారాయణ, పేట్ బషీర్‌బాగ్ ఏసీపీ కె.రాములు, ఇన్‌స్పెక్టర్ రాహుల్‌దేవ్ తెలిపారు. పోలీస్‌స్టేషన్ సిబ్బందితో పాటు అధనంగా ఇతర పోలీస్‌స్టేషన్లు, కేంద్రబలగాలతో కలిపి సుమారు 580 మందికి పైగా బందోబస్తు నిర్వహిస్తారని వారు తెలిపారు. 144 సెక్షన్ అమలులో ఉందని రాజకీయపార్టీ నాయకులు కూడా ఎన్నికలు సజావుగా జరగడానికి సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

ఏర్పాట్లు పూర్తి..

రాచకొండ కమిషనర్ తరుణ్‌జోషి



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన డీసీ శ్రీనివాస్‌రెడ్డి

అల్వాల్: రాచకొండ కమిషరేట్ పరిధిలో ఎన్నికలు సజావుగా జరిగేందుకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశామని రాచకొండ కమిషనర్ తరుణ్‌జోషి అన్నారు. నేరేడ్‌మెట్ భవన్స్ కాలేజీలోని డీఆర్సీసెంటర్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా స్ట్రాంగ్‌రూమ్ నిర్వహణ భద్రతా ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్ట్రాంగ్‌రూమ్ నుంచి కౌంటింగ్ కేంద్రానికి చేరుకునే మార్గంలో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకుంటామన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద పూర్తి స్థాయిలో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. డీసీపీలు పద్మజ, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు. అల్వాల్ సర్కిల్ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను డీసీ శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు.

ఓటుహక్కును వినియోగించుకోండి



మల్కాజిగిరి: ఓటుహక్కు ఉన్న ప్రతి ఒక్కరూ ఓటింగ్‌లో పాల్గొనాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీ ఎన్నికల కంటే ప్రస్తుతం ఓటర్ల సంఖ్య పెరిగిందని, ముఖ్యంగా నూతన ఓటర్లుగా ఉన్న యువత ఓటింగ్‌లో పాల్గొని ఓటింగ్ శాతం పెరగడానికి తోడ్పాటును అందించాలన్నారు. స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు బక్క నాగరాజు, రాందాస్ ధన్‌రాజ్‌లు సఫిల్‌గూడ మినీ ట్యాంక్ బండ్ పైన ఓటుహక్కును ఉపయోగించుకోవాలని కోరుతూ.. ప్లకార్డ్స్‌తో అవగాహన కల్పించారు.

ఉప్పల్ నియోజకవర్గంలో 5,40,502 ఓటర్లు..

407 పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి



ఉప్పల్: ఉప్పల్ నియోజకవర్గంలో మొత్తం 5,40,502 ఓటర్లు ఉన్నారు. పురుషులు 2,29,495, మహిళా ఓటర్లు 2,60,516, ఇతరులు 41 మంది ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. నియోజకవర్గ పరిధిలో 407 పోలింగ్ కేంద్రాలున్నాయి. డీఆర్సీ సెంటర్లల్లో 45 కౌంటర్ల ద్వారా ఈవీఎంలను పంపిణీ చేశారు. ఈ ఎన్నికల నిర్వహణకు 505 మంది పీఓలు 500 మంది ఏపీఓలు, 1200 మంది ఓపీలు విధుల్లో చేరారు. అదనంగా మరో 100 మంది అధికారులు అందుబాటులో ఉంటారని అధికారులు పేర్కొన్నారు.

భారీ బందోబస్తు..

నియోజకవర్గ పరిధిలో 22 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వాటి వద్ద ప్రత్యేక నిఘాతో పాటు అదనంగా సీసీ కెమెరాలను అమర్చినట్లు అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు 22 మంది రౌడీషీటర్లను అదుపులోకి తీసుకున్నారు. 39 మంది వద్ద రివాల్వర్లును స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసులు పారా మిలటరీ బలగాలు కవాతు చేస్తూ.. ఓటర్లలో ధైర్యం కలిపించారు.

ప్రతి పోలింగ్ కేంద్రంలో మౌలిక వసతులు

ప్రతి పోలింగ్ కేంద్రంలో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించామని ఆంజనేయులు తెలిపారు. తాగునీరు, విద్యుత్, టాయిలెట్స్, ర్యాంపుల ఏర్పాటు, ఎండకాలంలో వరుసలో నిలబడ్డ వారికి ఇబ్బంది కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. వృద్ధులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

- మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి దంపతులు హబ్సిగూడ వీధి నంబర్-8లోని శ్రీసాయి పబ్లిక్ స్కూల్‌లో తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు.
- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి దంపతులు కాప్రా విజయ హైస్కూల్‌లో ఓటు వేయనున్నారు.
- మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి నాచారం బాబానగర్‌లో ఓటుహక్కును వినియోగించుకోనున్నారు.
- మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి హబ్సిగూడలోని జై సంతోషినగర్ జ్ఞాన భారతి స్కూల్‌కు ఓటు వేసేందుకు రానున్నారు.
- మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ రామంతాపూర్ పబ్లిక్ స్కూల్‌లో తన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోనున్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ కార్పొరేటర్



కాంగ్రెస్‌లో చేరిన కార్పొరేటర్ మహేశ్వరి దంపతులు

బోడుప్పల్: రోజురోజుకూ కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజల్లో ఆదరణ పెరుగుతోందని మేడ్చల్ నియోజక వర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. బోడుప్పల్ 22వ డివిజన్ బీఆర్ఎస్ కార్పొరేటర్ దొంతరబోయిన మహేశ్వరి దంపతులు ఆదివారం బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోగుల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో వజ్రేష్‌యాదవ్ సమక్షంలో కాంగ్రెస్‌పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు తోటకూర అజయ్‌యాదవ్, రాసాల వెంకటేశ్‌యాదవ్, సుమన్ నాయక్, పార్టీ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్ పాల్గొన్నారు.

జేజీఆర్ పాఠశాలలో మాతృ దినోత్సవం



బోడుప్పల్: బృందావన్ కాలనీలోని జేజీఆర్ ఉన్నత పాఠశాలలో ఆదివారం మాతృ దినోత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ గంగరాజు ఉపాధ్యాయులను సన్మానించారు.

ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం



మల్లాపూర్: తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్, నర్సింగ్ సిబ్బంది ఆధ్వర్యంలో ఆదివారం నాచారంలోని ఈఎస్ఐ ఆస్పత్రిలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు, నర్సులు కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. డాక్టర్ రజవంత్, డాక్టర్ సతీష్, సరోజ, సూరజ్, యూనియన్ అధ్యక్షులు ప్రీతి, నర్సింగ్ సూపరింటెండెంట్ సీతామహాలక్ష్మి, పద్మ, వేణుకుమార్, నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమాజ నిర్మాణానికే రాజ్యాంగ రూపకల్పన



ఘట్‌కేసర్: అంబేడ్కర్ ఆలోచన విధానాలు ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ప్రభుద్ద భారత్ ఇంటర్నేషనల్ బాధ్యుడు మీసాల అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి కృష్ణతో కలిసి ఆయన ఆదివారం మాట్లాడుతూ.. కుల, మత బేధం లేకుండా సమసమాజ నిర్మాణం కోసం ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశానికి అవసరమైన రాజ్యాంగాన్ని అంబేడ్కర్ రచించాడన్నారు. శేఖర్, రాజేష్, అరుణ్, రోహిత్, కుమార్, రమేష్, ప్రవీణ్, రఘు, శ్రీనివాస్, గంగారం, కృష్ణంరాజు, విష్ణు, సచిన్, సాయచరణ్ పాల్గొన్నారు.



ఘనంగా మదర్స్ డే వేడుకలు

మల్కాజిగిరి: దివ్యాంగుల హక్కుల పోరాట సమితి మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా ఆధ్వర్యంలో మల్కాజిగిరిలో మదర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాతృమూర్తులను సన్మానించారు. అధ్యక్షుడు వినయ్, మహిళా విభాగం అధ్యక్షురాలు శాంతాబాయి, లక్ష్మి, నాగమణి, ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

కీసర: కీసర మండల ఎంపీపీ ఇందిరాలక్ష్మీనారాయణ తన జన్మదినం సందర్భంగా చీర్యాల లక్ష్మీనృసింహ్మాస్వామిసేవలో పాల్గొన్నారు. ఆదివారం ఉదయం దేవాలయానికి వచ్చిన ఎంపీపీ దంపతులు స్వామివారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం వేద పండితుల వేదమంత్రోచ్ఛరణలతో ఆశీర్వదించి మహాప్రసాదాన్ని అందజేశారు. ఆలయ ధర్మకర్త శ్రీహరిగౌడ్ పాల్గొన్నారు.





ముగిసిన ఆలయ బ్రహ్మోత్సవాలు

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ రైల్వే గేట్ వద్ద ఉన్న దుర్గా భవానీ ఆలయ బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఆదివారం ఆలయంలోని స్పటిక లింగానికి అభిషేకం, హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

14న వార్షిక బ్రహ్మోత్సవాలు

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ న్యూ మిర్జాలగూడలోని శ్రీ విజయ వినాయక ఆలయంలో ఈనెల 14 నుంచి ఆలయ 23వ వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మంగళవారం ఉదయం గురుప్రార్థన, గోపూజ, గణపతి పూజ, రక్షాబంధన, బుధవారం ప్రత్యేక హోమాలతో శ్రీలక్ష్మీ నరసింహాస్వామి శాంతి, కళ్యాణం నిర్వహించనున్నట్లు ప్రకటించారు.

ఘనంగా శ్రీవారి కల్యాణోత్సవం

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్‌లోని లక్ష్మీవేంకటేశ్వర దేవస్థానంలో ఆదివారం శ్రీవారి కల్యాణాన్ని ప్రధాన అర్చకులు ముడుంబై వేంకటరమణాచార్యులు, అర్చకులు తులసి రమణాచార్యులు ఘనంగా నిర్వహించారు. లోక కళ్యాణార్థం ప్రతినెలా రెండో ఆదివారం స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్నామని ఈఓ రవీందర్‌రెడ్డి తెలిపారు.

